నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శుక్రవారం 3 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

గుండెనిండా గులాబీ బాస్

- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పేర్లతో ఛాతిపై పచ్చబొట్టు

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పేర్లతో పచ్చగా పెరుగుతున్న పైరు

యువ రైతు రమేశ్ ఛాతీపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పేర్లతో పచ్చబొట్టు

ఇల్లెందు, జనవరి 2: ప్రాణాలకు తెగించి.. తెలంగాణ సాధించి.. పదేళ్లు పాలించి.. రైతుల పక్షాన నిలిచి.. అభివృద్ధి, సంక్షేమ పథకాలను పేదల దరిచేర్చారు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. ఆయనతోపాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కూడా తెలంగాణ పోరాటంలోనూ, వికాసంలోనూ తమదైన పాత్ర పోషించారు. అందుకని వీరిని అభిమానిస్తూ నిత్యం ఆరాధిస్తున్నాడు ఓ యువ రైతు.. అందుకు గుర్తుగా ఏకంగా వీరికి తన గుండెలపై స్థానమిచ్చాడు. వీరి పేర్లను తన ఛాతీపై పచ్చబొట్టుగా ముద్రించుకొని అభిమానాన్ని చాటుకున్నాడు. ఇక వారి పేర్లు కూడా ప్రతి రోజూ తనకు పచ్చగా కనిపించాలని తపించాడు. ఇందుకోసం తన పంట చేలోని మొక్కజొన్న పైరులోని కొన్ని మొక్కలను కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పేర్లుగా అక్షరమాల రూపంలో రాశాడు. వాటికి నిత్యం నీరు పోస్తుండడంతో అవి పచ్చగా ఎదుగుతున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మూడ్‌తండాకు చెందిన మూడ్ రమేశ్, రాంబాయి దంపతులది వ్యవసాయం కుటుంబం. తమకున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. తెలంగాణ ఏర్పడక ముందు కరెంటు సరిగా లేక వారి చేలో ఒక పంటను మాత్రమే పండించేవారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పదేళ్ల కాలంలో 24 గంటలపాటు విద్యుత్ ఇవ్వడంతో ఎకరం భూమిలో మూడు రకాల కూరగాయల పంటలు సాగు చేశారు. తమకు ఇంత చేసిన కేసీఆర్ ఎప్పుడూ తమ కళ్లముందే ఉండాలని వారు తపించిపోయారు. ఇందుకోసం సదరు యువ రైతు రమేశ్.. తన గుండెలపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పేర్లు పచ్చపొడిపించుకున్నాడు. ఎడమ చేతిపై కూడా రాయించుకున్నాడు. ఇంకా తను సాగు చేస్తున్న ఎకరం మొక్కజొన్న తోట మధ్యలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల పేర్లను రాశాడు. దానిలో మొక్కజొన్న గింజలు నాటాడు. ప్రతిరోజూ తోటకు వచ్చిన రమేశ్, రాంబాయి దంపతులు తమ తోట తోపాటు తమ అభిమాన నేతల పేర్లు ఉన్న మొక్కలనూ సంరక్షిస్తున్నారు. తమ ఆరాధ్య నేతల పేర్లు పచ్చగా ఎదుగుతుండడాన్ని చూసి మురిసిపోతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిన వారు రైతుల హృదయాలలో సుస్థిరంగా నిలిచిపోతారని యువ రైతు రమేశ్ పేర్కొన్నాడు.

నూతన సంవత్సరం సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం రాత్రి సిద్దిపేటలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ కల్వకుంట్లను వద్దిరాజు కలిసి బొకే అందించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రైతుభరోసా కొందరికేనా?



రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మొత్తానికే కోతలు పెట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు కర్షకుల్లో కలవరం మొదలైంది. పంటలు వేసిన రైతులకే రైతుభరోసా అంటూ పాలన చేపట్టిన మొదట్లోనే మొదలుపెట్టిన కాంగ్రెస్ పాలకులు.. తరువాత ఒక్కో నిబంధనను తెరమీదకు తెస్తూ వచ్చారు. అభిప్రాయ సేకరణలో రైతుల సూచనలనే పరిగణనలోకి తీసుకున్నామని చెబుతూ రైతుల నెత్తిన వారి చేయినే పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు ఏకంగా రైతుభరోసాకు ఎగనామం పెట్టేందుకు కుట్ర పన్నుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంక్రాంతి తరువాత రైతుభరోసా జమ చేస్తామంటూ కొన్ని నెలలుగా మంత్రులు ప్రకటనలు చేస్తూ వస్తున్నారు. తీరా సంక్రాంతి సమీపిస్తున్న తరుణంలో మరికొన్ని నిబంధనలంటూ లీకులు చేస్తున్నారు. ఇక నుంచి ఏ సీజన్‌కు ఆ సీజన్ చొప్పున రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ ప్రతాలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో నిజంగా పంట వేసిన రైతులకే రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ ఆలోచనలనే అమలుచేస్తే పేద రైతులు పెద్ద సంఖ్యలో నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. -భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 2 (నమస్తే తెలంగాణ)

- 'కోతలు' పెట్టేందుకు కాంగ్రెస్ సర్కారు కసరత్తు!
- ఇకపై రైతుల డిక్లరేషన్ తీసుకోనున్నట్లు ప్రచారం
- 1,33,396 మంది రైతుల్లో ఎందరిపై ప్రభావం?
- మరి గడిచిన రెండు సీజన్ల 'భరోసా' ఎగ్గొట్టినట్లేనా?
- తాజా సాయమూ సంక్రాంతి తర్వాతేనంటూ ప్రకటనలు
- హామీలు నెరవేర్చకపోవడంతో ఇప్పటికే కర్షకుల గుర్రు

అధికారం కోసం అన్నదాతలను అడుగడుగునా మభ్యపెట్టింది కాంగ్రెస్. తీరా అధికారంలోకి వచ్చాక తన కోతల ప్రతాపాన్ని కర్షకులపై చూపిస్తోంది. ఎకరానికి రూ.10 వేల చొప్పున మొన్నటి వరకూ నిరాటంకంగా రైతుబంధును అందిస్తూ వచ్చిన గత కేసీఆర్ ప్రభుత్వంపై లేని పోని ఆరోపణలు చేసింది కాంగ్రెస్. పైగా తాము అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ సర్కారు ఇస్తున్నట్లుగా రూ.10 వేలు కాకుండా.. రూ.15 వేలు ఇస్తామంటూ నమ్మబలికింది. దీంతో అన్నదాతలు ఆదరించారు. కానీ.. తీరా అధికారంలోకి వచ్చాక వారినే నట్టేట ముంచాలని చూస్తోంది కాంగ్రెస్. అధికారం చేపట్టి ఏడాది దాటిపోయినా ఇప్పటికే రెండు సీజన్ల రైతుభరోసాకు ఎగనామం పెట్టింది. మరోవైపు రుణమాఫీ విషయంలోనూ మొండిచేయి చూపింది. అధిక శాతం మంది అర్హులైన రైతులకు రుణమాఫీని వర్తింపజేయలేదు. అనేక నిబంధనలు పెడుతూ అర్హులకు చోటులేకుండా చేసింది. ఇక రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణాలున్న రైతులను పూర్తిగా పక్కన పెట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులందరూ ఇప్పటికే గుర్రుగా ఉన్నారు. రుణమాఫీ కాని రైతులందరూ సొసైటీల దగ్గర, బ్యాంకుల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఒకవైపు రైతుభరోసా ఇవ్వక, మరోవైపు రుణమాఫీ చేయక, ఇంకోవైపు బ్యాంకుల చుట్టూ తిరిగి నందుకు పంటలు చేతికి రాక అన్ని విధాలా నష్టపోయిన అన్నదాతలు.. కాంగ్రెస్ సర్కారుపై కోపంతో ఉన్నారు. ఇదే సమయంలో సెల్ఫ్ డిక్లరేషన్ల పేరుతో రైతులపై పిడుగులు పడేసేందుకు సర్కారు కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కుటుంబం యూనిట్..

గత కేసీఆర్ ప్రభుత్వం రైతును యూనిట్‌గా తీసుకొని ప్రతి రైతుకూ రైతుబంధును అందించింది. కానీ.. ఏడాది క్రితం వచ్చిన కాంగ్రెస్ సర్కారు రైతు కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటోంది. గత ప్రభుత్వం ఒక రైతుకు ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు రైతుబంధు అందించింది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం కోతలు పెడుతూ ఏడు ఎకరాలుగా సీలింగ్ విధించే ప్రయత్నంలో ఉంది. దీంతో ఒకవేళ ఒక కుటుంబంలో భార్యాభర్తల పేరిట చెరో ఏడు ఎకరాల సాగు భూమి ఉన్నా ఇద్దరికీ కలిపి ఏడు ఎకరాల వరకే రైతుభరోసా అందించనుంది. అందులోనూ పంటలు సాగు చేస్తున్న భూములకే పంటల పెట్టుబడి సాయం అంటూ మెలిక పెడుతుండడంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జిల్లాలో 1,33,396 మంది రైతులు..

జిల్లాలో 1,33,396 మంది రైతులున్నారు. ఏటా రెండు సీజన్లలో పంటలు సాగు చేస్తున్నారు. మొత్తంగా 4,50,800 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో పోడు రైతులు కూడా జొన్నలు, నువ్వులు పండిస్తున్నారు. వీరికి కూడా గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు అందించింది. రైతు బీమా అమలు చేసింది. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఏరివేతల యత్నాల్లో జిల్లా రైతుల్లో ఎంతమంది రైతుభరోసాకు అర్హులవుతారన్న ప్రశ్న తలెత్తుతోంది.

విధివిధానాలు ఇంకా రాలేదు..

రైతుభరోసా విధివిధానాలు సంక్రాంతి నాటికి ఇచ్చే అవకాశాలున్నాయి. అర్హులకు మాత్రమే రైతుభరోసా వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెడుతుందో తెలియదు. మార్గదర్శకాలు ఇంకా మాకు రాలేదు. వీసీ ద్వారా మాకు ప్రభుత్వం నుంచి సూచనలు చేస్తారు. ప్రస్తుతం సన్న వడ్లకు బోనస్ వస్తోంది.
-బాబూరావు, డీఏవో, భద్రాద్రి

రెండు పంటలకు రైతుభరోసా ఇవ్వలేదు..

గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు తప్పితే ఇంత వరకూ పంటల పెట్టుబడి సాయం అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండు పంటలకు రావాల్సిన రైతుభరోసా రానేలేదు. పైగా రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరగడమే పనిగా పెట్టుకోవాల్సి వచ్చింది. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్లు అందరికీ రైతుభరోసా ఇవ్వాలి.
-సత్తి నాగేశ్వరరావు, రేపల్లెవాడ, చండ్రుగొండ

నిబంధనలు లేకుండా రైతుభరోసా అందించాలి..

పంటలు వేయాలంటే పెట్టుబడి ఉండాలి. గడిచిన రెండు పంటలకు రైతుభరోసా రాలేదు. బయట అప్పులు తెచ్చాం. తుపాను వల్ల పంటలు దెబ్బతిన్నాయి. వడ్లు ఆరబోస్తే వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి. ఇన్ని కష్టాల్లో మాకు రైతుభరోసా కూడా ఇవ్వట్లేదు. ఇకముందైనా నిబంధనలు లేకుండా రైతుభరోసా ఇవ్వాలి. **-గాలం రవి, రైతు, రావికంపాడు, చండ్రుగొండ**

నెట్‌బాల్ విజేతలు పాలమూరు, ఖమ్మం జట్లు

నెట్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నీ బాలికల విభాగంలో విజేత ఖమ్మం జట్టు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 2: మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ టోర్నీ గురువారం ముగిసింది. హోరాహోరీగా మ్యాచ్‌లు సాగాయి. బాలుర విభాగంలో పాలమూరు, బాలికల విభాగంలో ఖమ్మం జట్లు చాంపియన్లుగా నిలిచాయి. బాలుర విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 19-16 పాయింట్ల తేడాతో ఖమ్మంపై గెలుపొందింది. బాలికల విభాగంలో ఖమ్మం 23-06 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలిచింది.

మున్నేరు వరద నియంత్రణకు..
పకడ్బందీ చర్యలు

- వరదను తట్టుకునేలా రిటైనింగ్ వాల్ డిజైన్
- అధికారుల సమీక్షలో ఖమ్మం కలెక్టర్ ఖాన్

మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్

మామిళ్లగూడెం, జనవరి 2: మున్నేరు వరద నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణ అంశాలపై అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్‌లతో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. 'మున్నేరుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ డిజైన్ ఏమిటి? గత రికార్డుల ప్రకారం అత్యధిక నీటి ప్రవాహం స్థాయి ఎంత? రిటైనింగ్ వాల్ ఎంత ప్రవాహానికి ఎంత ఎత్తులో నిర్మించాలి?' వంటి అంశాలను నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. 'బఫర్ జోన్ వద్ద ఎంత భూమి ఆక్రమణకు గురైంది? మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎంత సమయం పడుతుంది? ఎంత భూమి సేకరించాలి? వచ్చే వానకాలం నాటికి పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయా? రాబోయే వరదల నియంత్రణకు ఏ చర్యలు తీసుకోవాలి' వంటి వివరాలను తెలుసుకొని మ్యాపులను పరిశీలించి సూచనలు చేశారు. అత్యధిక వరద ప్రవాహం ఉన్న సమయంలో మున్నేరు నదికి 3.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చినా తట్టుకునేలా రిటైనింగ్ వాల్ డిజైన్ చేశామని, గత రికార్డుల ప్రకారం మున్నేరు నది 36 మీటర్ల ఎత్తులో ప్రవహించిందని, దానిని పరిగణనలోకి తీసుకుంటూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని ఎస్ఈ వెంకటేశ్వరరావు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ఆమోదం పొందిన డిజైన్ ప్రకారం అవసరమైన భూసేకరణ చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఇరిగేషన్ ఈఈ అనన్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మ్యూజియం పనులు పూర్తి చేయండి

గిరిజన మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 2 : గిరిజన మ్యూజియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ అధికారులను ఆదేశించారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో మ్యూజియం పనులను అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి దగ్గరపడుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను ఈ నెల 5వ తేదీ నాటికి పూర్తయ్యేలా చూడాలన్నారు. మ్యూజియం చుట్టూ ఫెన్సింగ్ మల్టీకలర్‌లో ఉండాలని, సెల్ఫీ పాయింట్ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఉండేలా డిజైన్ చేయాలన్నారు. పిల్లల ఆటవిడుపు కోసం క్రీడా స్థలంలో క్రీడా పరికరాలను సమకూర్చే పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. పర్యాటకులు కూర్చునేలా వెదురుతో తయారు చేసిన కుర్చీలు, సోఫాలు అమర్చాలని, మ్యూజియం దగ్గర నుంచి పర్యాటకులు ప్రవేశించే స్వాగత ద్వారం వరకు విద్యుత్ కాంతులు వెదజల్లే విధంగా లైట్లు, కళాఖండాలు వరుసగా ఏర్పాటు చేయాలన్నారు. పీవో వెంట ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, ఎఫ్‌డీసీ ఉదయ్‌కుమార్, జేడీఎం హరికృష్ణ, ఏపీవో పవర్ ఏఈ మునీర్‌పాషా, డీఈ హరీశ్, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసులు పెడతాం..

ఆపరేషన్ 'స్మైల్-XI'లో భాగంగా అధికారులతో ఎస్పీ సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, జనవరి 2 : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 31 వరకు జరుగనున్న అపరేషన్ స్మైల్-XIలో భాగంగా పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్‌మెంట్, విద్యా శాఖ, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ, ఆరోగ్య శాఖలతోపాటు వివిధ శాఖల అధికారులతో ఎస్పీ తన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సబ్ డివిజన్లుగా ఉన్న కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు ప్రాంతాల్లో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18 ఏళ్లలోపు తప్పిపోయిన, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఫ్యాక్టరీలు తదితర వ్యాపార సముదాయాల్లో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే '1908' లేదా డయల్ '100'కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. అనంతరం అపరేషన్ స్మైల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌సింగ్ కుమార్, ఆపరేషన్ స్మైల్ పోలీస్ నోడల్ ఆఫీసర్, డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామిగౌడ్, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనినా, సీడబ్ల్యూసీ హరికుమారి, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ సందీప్, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, ఎస్సైలు రమాదేవి, తిరుపతి, నాగభిక్షం, రామకృష్ణ, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఎస్ఏ' ఉద్యోగుల నిరసన ప్రదర్శన

మంత్రుల ఫొటోలు ఉన్న మాస్కులు ధరించి పాల్గొన్న ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్/ కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 2 : సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 24వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఖమ్మంలో ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు ఉన్న మాస్కులు ధరించి పెవిలియన్ గ్రౌండ్ నుంచి జడ్పీ సెంటర్ వరకు ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. తమ సర్వీసును క్రమబద్ధీకరించి మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. భద్రాది కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించి రైల్వే స్టేషన్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను సాధించే వరకూ సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం నాయకులు మోహన్, తులసి, సురేశ్, కవిత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో మంత్రుల ఫొటోలు ఉన్న మాస్కులు ధరించి ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు, కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

చైనా మాంజా విక్రయించొద్దు..

- నిషేధిత మాంజాను సీజ్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం క్రైం, జనవరి 2 : నిషేధించిన చైనా మాంజాను కొందరు అక్రమంగా విక్రయిస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. రామవరం ప్రాంతంలో కృష్ణారావు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చైనా మాంజా ఆయన మెడకు చుట్టుకొని గొంతు కోసుకుపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణంలోని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, ఎస్సైలు బి.పురుషోత్తం, ఎస్‌కే.మస్తాన్‌లు తమ సిబ్బందితో చైనా మాంజాల విక్రయాలపై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలువురు విక్రయదారులపై కేసు నమోదు చేశారు. పవన్ టాయ్స్ దుకాణంలో 30 బండిళ్ల చైనా మాంజా, పది ప్యాకెట్ల దారం రోల్స్, పవన్ జనరల్ మర్చంట్స్‌లో 14 బండిళ్ల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చైనా మాంజాతో మనుషులకే కాకుండా పక్షి జాతికి సైతం ప్రమాదాలు వాటిల్లే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం దానిని నిషేధించినట్లు పేర్కొన్నారు.